
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కరీంనగర్
జిల్లా వార్తలు

సోమవారం 31 మార్చి 2025

ఘనంగా ఉగాది సంబరాలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు... పంచాంగ పఠనాలు
- మహాశక్తి ఆలయంలో పాల్గొన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- యజ్ఞ వరాహ క్షేత్రంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు నగరంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయాల్లో, వాడవాడల్లో పంచాంగ పఠనాలు, ఉగాది పచ్చడి స్వీకరణలు, కవి సమ్మేళనాలు నిర్వహించారు. భక్తులు ఆలయాలను దర్శించి ఇంటిల్లిపాది చల్లగా ఉండాలని కోరుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలసి భోజనాలు చేశారు. ఆలయాల్లో, కూడళ్లలో, సామాజిక, ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా పంచాంగ శ్రవణం చేసి తమ భవిష్యత్ గురించి తెలుసుకున్నారు. అర్చకులు, పురోహితులను ఇళ్లకు ఆహ్వానించుకొని పంచాంగం చెప్పించుకున్నారు. ఏ ఇంట చూసినా ఆధ్యాత్మిక వాతావరణం, పండుగ ఆనందం కనిపించింది. చైతన్యపురి మహాశక్తి ఆలయంలో ఉదయం పచ్చడి వితరణ, సాయంత్రం పంచాంగ శ్రవణంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, కుటుంబ సభ్యులు, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, నాయకులు పాల్గొన్నారు. మంత్రి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ యేడు అందరికి కలసి రావాలని,

(మిగతా 8వ పేజీలో)


పంచాంగ శ్రవణం చేస్తున్న భక్తులు


మహాశక్తి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు, పంచాంగ శ్రవణం చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్


యజ్ఞవరాహక్షేత్రంలోని పంచాంగ పఠనంలో పాల్గొన్న ఎంఎల్ఏ గంగుల కమలాకర్, కుటుంబ సభ్యులు, భక్తులు

ఆస్తి పన్ను బకాయిలపై దృష్టి

- రెవెన్యూ గార్డెన్, రెవెన్యూ క్లబ్ సీజ్
- కొరడా ఝళిపిస్తున్న బల్దియా
- నేటితో ముగియనున్న వడ్డీ మాఫీ గడువు

కరీంనగర్ టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను బకాయిదారులపై నగరపాలక సంస్థ కొరఢా ఝళిపిస్తోంది. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ బకాయిదారుల ఇళ్లు, కార్యాలయాలకు వెళ్లి ఆస్తిపన్ను వసూలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను బకాయిలను వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం కింద ఒకేసారి చెల్లిస్తే 90 శాతం వడ్డీ మాఫీ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. మార్చి 31లోగా ఆస్తిపన్ను బకాయిలను ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బకాయిలను చెల్లించాలంటూ మున్సిపల్ అధికారులు బకాయిదారులపై ఒత్తిడి తెస్తున్నారు.

నల్లా కనెక్షన్ల తొలగింపు, ఆస్తుల జప్తు

బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయడంతోపాటు ఆ ఇంటికి సంబంధించిన బకాయిలు ఇన్ని ఉన్నాయంటూ ఇళ్ల ఎదుట నోటీసును అతికించారు. అయినా బకాయిలను చెల్లించకుంటే నోటీసులు ఇచ్చిన ఇళ్లకు వెళ్లి నల్లాలు తొలగిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది ఇళ్లకు నల్లా కనెక్షన్లను తొలగించారు. 50వేలకు పైన బకాయిలు ఉన్న ఇంటి


రెవెన్యూ క్లబ్‌కు తాళం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

యజమానుల ఆస్తులను జప్తు చేయడంతోపాటు థియేటర్లు, వివిధ సంస్థలకు చెందిన కార్యాలయాలకు తాళాలు వేసి సీజ్ చేస్తున్నారు. ఆదివారం ఆస్తిపన్ను బకాయిలు చెల్లించక పోవడంతో కలెక్టరేట్ ఎదుట ఉన్న రెవెన్యూ గార్డెన్, రెవెన్యూ క్లబ్‌లకు తాళం వేసి సీజ్ చేశారు. ఈ రెండింటికి సంబంధించి 87 లక్షల రూపాయల బకాయిలు ఉన్నాయి.

కరీంనగర్ నగరపాలక సంస ఈఈ రొడ్డ యాదగిరిని ఆస్తిపన్ను బకాయిలను చెల్లించాలని లేనిపక్షంలో ఆస్తులను జప్తు చేస్తామంటూ హెచ్చరిస్తూ ఫోన్ చేశారు. ఆదివారం రాత్రి ఆయన ఇంటికి డిజాస్టర్ వెహికిల్‌ను పంపించి ఆస్తి జప్తు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఈఈ యాదగిరి మాట్లాడుతూ 2025 మార్చి 31 వరకు తాను హౌసింగ్‌బోర్డుకాలనీలోని తన ఇంటికి సంబంధించిన ఆస్తిపన్నులను చెల్లించాలని, 2022 సంవత్సరానికి ముందు బకాయిలున్నాయంటూ తన ఆస్తులను జప్తు చేసేందుకు సిబ్బందిని ఎలా పంపిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, ఎంతో మంది ఆస్తిపన్నులు బకాయిలు ఉంటే వారి ఆస్తులను సీజ్ చేయడం లేదన్నారు. 2022కు ముందు పన్నులు చెల్లించాలని ఒత్తిడి చేయడం తనపై వివక్ష చూపడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. 34వ డివిజన్ గోదాంగడ్డ ఏరియా హనుమాన్ దేవాలయ సమీపంలో ఆస్తిపన్ను బకాయిలు చెల్లించాలని అడిగిన వార్డు అధికారి, సపోర్టింగ్ ఉద్యోగిపై అంథోని అనే వ్యక్తి దురుసుగా ప్రవర్తించాడు. సపోర్టింగ్ ఉద్యోగిపై దాడిచేసి ఆయన మోటార్ బైక్‌ను ధ్వంసం చేయడంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగులతో దురుసుగా వ్యవహరిస్తే కఠినచర్యలు

- నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

ఆస్తిపన్ను బకాయిల వసూళ్లకు వెళ్లిన మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తే చట్టం ప్రకారంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ హెచ్చరించారు. బకాయిదారులు గడువులోగా పన్నులు చెల్లించి 90 శాతం వడ్డీ మాఫీని వినియోగించుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ కేసుల విషయంలో కాంగ్రెస్ యూటర్న్

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ కేసుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం యూటర్న్ తీసుకుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని తన నివాసంలో ప్రధాని మోడి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని తల్లితో కలిసి ఆదివారం వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కేసులపై కాంగ్రెస్ ప్రభుత్వం యూటర్న్ తీసుకుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును పూర్తిగా నీరుగారుస్తున్నారన్నారు. శ్రవణ్‌రావుకు బెయిల్ వచ్చేలా చేసి కాంగ్రెస్ సహకరిస్తుందని విమర్శించారు. గత ఎన్నికల ముందు కేసీఆర్‌ను జైల్లో వేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి సర్కార్ యూటర్న్ తీసుకుందన్నారు. కాంగ్రెస్ పాలనను చూస్తే జ్యోతిష్య పండితులు చెప్పేది నిజమేనని స్తోందన్నారు. ఏడాదిగా దొంగతనాలు ఎక్కువై పోయాయని, ప్రజాప్రతినిధులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ శాఖలో చూసినా అవినీతి రాజ్యమేలుతోందన్నారు. కాంగ్రెస్ నేతలకు కరప్షన్ వైరస్ సోకిందన్నారు. కాంట్రాక్టర్ల దగ్గర నుంచి పెండింగ్ బిల్లుల వరకు ప్రతి దాంట్లోనూ కమీషన్లు ఇవ్వనిదే పని జరగడం లేదన్నారు. రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీని స్వాగతిస్తున్నామని, బియ్యం ఖర్చంతా కేంద్రమే భరిస్తుందన్నారు. ఒక్కో కిలోకు మోదీ ప్రభుత్వం 40 రూపాయలు చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై పది రూపాయలు మాత్రమే పడుతుందన్నారు. ప్రజల దృష్టిని దారి మళ్లించ డానికి డీలిమిటేషన్ పేరుతో డ్రామాలాడుతున్నారన్నారు. దేశాన్ని విభజిస్తామంటూ బీఆర్ఎస్ నేతలు మాట్లాడుత దేశద్రోహానికి పాల్పడు తున్నారన్నారు. ఆర్ఎస్ఎస్ దేశభక్తి కలిగిన సంస్థ అని దేశం ధర్మం, సనాతన ధర్మం, హిందు సమాజం సంఘటితం చేసేందుకు నిరం తరం కృషి చేస్తు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఆర్ ఎస్ఎస్ ఏనాడు ఉగ్రవాదులను పెంచి పోషించలేదన్నారు. ఉగ్రవా దులకు బెయిల్ కోసం ఏనాడు పాటు పడలేదన్నారు. ఒవైసీ ఆసు పత్రిలో ఉగ్రవాదులు దొరికారన్నారు. దారుస్సలాం టెర్రరిస్టులకు అడ్డాగా మారిందన్నారు. మజ్లిస్‌కు తెలంగాణ అంతటా పోటి చేసే దమ్మే లేదన్నారు. అధికారంలో ఏ పార్టీఉంటే ఆ పార్టీకి అమ్ముడు పోయే పార్టీ మజ్లిస్ అని విమర్శించారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుపై అందరి అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. అతి త్వరలోనే పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడం తథ్యమన్నారు. సమావేశంలో మాజీ మేయర్ సునీల్‌రావు, వాసాల రమేష్ పాల్గొన్నారు.

నేడు రంజాన్

- ఈద్ ప్రార్థనలకు సిద్ధమైన ముస్లింలు



కరీంనగర్ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భక్తి విశ్వాసాలు, ఉపవాస దీక్షలు, జకాత్, ఫిత్రా వంటి దానధర్మాలకు ప్రతీకగా భావించే ఈదుల్ ఫితర్ (రంజాన్)ను సోమవారం ముస్లింలు జరుపుకోనున్నారు. ఆదివారం రాత్రి నమాజుల అనంతరం నెలవంక కనిపించడంతో రంజాన్ మాస ముగింపు సూచకంగా భావించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నెల రోజుల దీక్ష ముగించి మరుసటి రోజు ప్రత్యేక నమాజ్ సామూహికంగా చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటారు. మాసమంతా ఖురాన్ పఠనంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు చిన్నా పెద్దా తేడా లేకుండా అల్లాహ్‌పై తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

మార్కెట్‌లో సందడి

రంజాన్ వస్త్రాలు, వస్తువుల కొనుగోళ్లతో రెండు, మూడు రోజుల నుంచి మార్కెట్ సందడిగా మారింది. ముస్లింలు షాపింగ్ చేస్తూ బిజీగా గడుపుతున్నారు. గిరాకీ బాగుంటుందని వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధరలు పెరిగాయంటూ కొనుగోలుదారులు వాపోతున్నారు. వస్త్ర, వ్యాపార సముదాయాలు జన జాతరను మరపిస్తున్నాయి. పురుషులు బట్టలు, టోపీలు, అత్తర్లు, స్ప్రేలు, భుజాలపై టవల్స్, స్వీట్లు, సేమియాలు, స్త్రీలు బట్టలు, గాజులు, సుర్మా, మెహందీ, అలంకరణ సామగ్రి కొంటున్నారు. గృహాలంకరణ సామగ్రికి గిరాకీ పెరిగింది. లాల్చీలు, పైజామాలు, ఫ్రాక్‌లు, పిల్లల కుర్తాలు, రెడీమెడ్‌గా లభ్యమౌతుండడంతో కొనడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

నెలవంక దర్శనంతో నెలకొన్న సందడి

నెలవంక దర్శనమిచ్చింది. మసీదులు, ముస్లింల గృహాల్లో సందడి నెలకొంది. ముస్లింల ముఖాల్లో ఆనందోత్సాహాలు కనిపిం చాయి. ఆదివారం రాత్రి నమాజుల అనంతరం నెలవంక కనిపించ డంతో ముస్లింలు పవిత్ర రంజాన్ మాసం ముగింపు సూచకంగా భావించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలింగనాలు చేసుకున్నారు.

ఈద్గాల్లో ఏర్పాట్లు

రంజాన్ సందర్భంగా పలు ఈద్గాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం సామూహిక ప్రార్థల దృష్ట్యా మున్సిపల్, పోలీసు, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. షామియానాలు, టెంట్లు, కార్పెట్లు, సౌండ్ సిస్టంలు, త్రాగునీటి సౌకర్యం కల్పించారు. ప్రార్థనల సమయంలో పోలీసులు వాహనాల దారి మళ్లింపు చర్యలు చేపట్టనున్నారు.

నేడు ఈద్గాల్లో నమాజు... సందేశాల వివరాలు

నగరంలోని, నగర శివారులోని పలు ఈద్గా మైదానాల్లో సోమవారం ఉదయం 9 నుంచి 10 గంటల లోపు సామూహిక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. వన్ టౌన్ పోలీసు స్టేషన్ వద్ద గల పురానీ (ఖదీమ్‌షాహి) ఈద్గాలో 9 గంటలకు సయ్యద్ షా మొహమ్మద్ ఖాద్రి నమాజ్ చేయించి సందేశమివ్వనున్నారు. చింతకుంట ఈద్గాలో 9-15 గంటల నుంచి ముఫ్తీ ఎత్తెమాదుల్ హక్ నమాజ్ చేయించనుండగా మొహమ్మద్ ఖైరొద్దీన్ సందేశమివ్వనున్నారు. సాలెహ్‌నగర్ ఈద్గాలో ఉదయం 9 గంటలకు కరీంనగర్ సదర్ ఖాజీ మన్‌ఖబత్‌షాఖాన్ నమాజ్ చేయించనుండగా ముఫ్తీ మహమ్మద్ ఫియాస్ మొహియొద్దీన్ సందేశమివ్వనున్నారు.


రంజాన్ పండుగ సందర్భంగా సాలెహ్‌నగర్ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాటు చేసిన షామియాలు

నిరుపయోగంగా చేతిపంపు

గంగాధర, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్లుగా అన్ని కాలాల్లో రక్షితనీరందించిన చేతిపంపు నేడు పనికిరాకుండా పోయింది. గంగాధర మండలం రంగరావుపల్లి ప్రభుత్వపాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన చేతిపంపు కొన్ని సంవత్సరాలు సమీపంలోని ఇళ్లకు అన్నికాలాల్లో నీరందించి ఆదుకుంది. ఈ చేతిపంపు వేసవిలో నీరు దొరకని సమయంలో ఎన్నో కుటుంబాలను ఆదుకుంది. ప్రస్తుతం గ్రామంలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణంతో దిగువకు పడిపోయి పనికిరాకుండా పోయింది. రోడ్డు పక్కన ఉన్న ఈ చేతిపంపు పనిచేయలేని స్థితికి చేరింది. ఎన్నో సంవత్సరాలుగా గ్రామానికి ఆపద సమయంలో తాగునీరందించిన చేతిపంపును వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.


రోడ్డు పక్కన నిరుపయోగంగా చేతి పంపు

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

మండల సమన్వయకర్తల నియామకం

కరీంనగర్ అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) ఆధ్వర్యంలో ఏప్రిల్ 2 నుంచి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర జిల్లాలో ప్రారంభిస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం మండలాల వారీగా సమన్వయకర్తలను నియమించామన్నారు. మామిడి అనిల్ కుమార్ (కరీంనగర్ రూరల్ మండలం), కర్ర సత్యప్రసన్నరెడ్డి (కొత్తపల్లి మండలం), పత్తి కృష్ణారెడ్డి (చొప్పదండి మండలం), సుదగోని లక్ష్మీనారాయణగౌడ్ (గంగాధర మండలం), రహమత్ హుస్సేన్ (రామడుగు మండలం), పులి ఆంజనేయులుగౌడ్ (మానకొండూర్ మండలం), ఎస్‌కే సిరాజ్ హుస్సేన్ (తిమ్మాపూర్ మండలం), కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి (కేశవపట్నం మండలం), కొరివి అరుణ్ కుమార్ (గన్నేరువరం మండలం)ను నియమించామన్నారు. బానోతు శ్రావణ్ నాయక్(హుజూరాబాద్ మండలం), నడిపెల్లి అశోక్ రావు(జమ్మికుంట మండలం), పులి కృష్ణ(ఇల్లందకుంట మండలం)కల్వల రాంచందర్, గోపు మల్లారెడ్డి (వీణవంక మండలం), బత్తిని శ్రీనివాస్‌గౌడ్ (సైదాపూర్ మండలం), గడ్డం విలాస్‌రెడ్డి (చిగురుమామిడి మండలం)ని నియమించినట్లు చెప్పారు.

ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి
• అస్తవ్యస్తంగా విస్తరణ పనులు
6
గ్రూప్ 1 లో మెరిసిన యువత
• జిల్లాకు చెందిన పలువురికి రాష్ట్రస్థాయి ర్యాంకులు

నామమాత్రంగా రక్షణ కిట్ల పంపిణీ

- ప్రమాదాల బారిన పడుతున్న గీత కార్మికులు

చిగురుమామిడి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గీత కార్మికులను ప్రమాదాల బారి నుంచి కాపాడేందుకు కాటమయ్య రక్షణ కిట్లను అందజేస్తామని ప్రకటించింది. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో కిట్లు అందక గీత కార్మికులు



ఇబ్బంది పడుతున్నారు. మండలంలో ప్రతి రోజు ఏదో ఒక గ్రామంలో గీత కార్మికులు ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. కొన్ని సందర్భాల్లో మృతి చెందుతున్నారు. మండలంలో 17 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 850 మంది గీత కార్మికులు ఉన్నారు. ఇప్పటి వరకు 80 మందికి మాత్రమే రక్షణ కిట్లు అందాయి. మండలంలోని మూడు గ్రామాలకు చెందిన కార్మికులకు కిట్లు అందించారు. అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే కిట్లు రావడం లేదని గీత కార్మికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాటమయ్య రక్షణ కిట్లు అందించాలని మండల గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులు కోరుతున్నారు.


తాటిచెట్టుపై నుంచి పడి గాయపడ్డ బూరుగు సంజీవ్(ఫైల్)

ప్రతి కార్మికుడికి రక్షణ కిట్టు ఇవ్వాలి..

- తాళ్లపల్లి తిరుపతిగౌడ్, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు



ప్రతి గీత కార్మికుడికి ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్లు అందించాలి. తాటి, ఈత చెట్లు ఎక్కుతూ ప్రమాదాలకు గురైన కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రక్షణ కిట్లు పంపిణీ చేయాలి.

బ్రహ్మోత్సవాల సందడి ఏది?

- ఇల్లందకుంటలో 4 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- వాల్ పోస్టర్లు, ప్రచార రథాలు లేవు
- ఈ ఏడాది కూడా కమిటీ లేనట్టే..



ఇల్లందకుంట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 4 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలు సమీపిస్తున్నా ఎటువంటి సందడి కనిపించడం లేదు. ఇప్పటి వకు కనీసం వాల్ పోస్టర్‌నూ ఆవిష్కరించలేదు. ప్రచార రథాలనూ ప్రారంభించలేదు. ప్రతి ఏటా 15రోజుల ముందే వాల్ పోస్టర్లు ఆవిష్కరించి, ప్రచార రథాలు ప్రారంభించేవాళ్లు. ఈ యేడాది ఎటువంటి కదిలికా కనిపించడం లేదు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ నియమించాలని కాంగ్రెస్ నాయకులు మంత్రులకు లేఖలు రాశాలు. ఇప్పటికీ కమిటీల ఏర్పాటుపై ఎటువంటి ప్రకటనా రాలేదు. వాల్ పోస్టర్‌పై కమిటీ మెంబర్ల పేర్లు ఉండాల్సి ఉంటుంది. కాబట్టి పోస్టర్ ఆవిష్కరించట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఆలయ ఇన్‌చార్జి ఈవో కందుల సుధాకర్‌ను వివరణ కోరగా సోమవారం జిల్లా మంత్రుల వద్దకు వెళ్లి పోస్టర్ ఆవిష్కరిస్తామని తెలిపారు.వెంటనే ప్రచార రథాలు కూడా ప్రారంభిస్తామ్నారు.


ఇల్లందకుంటలోని సీతారామచంద్రస్వామి ఆలయం

ప్రచార రథాలు ఎప్పుడు ప్రారంభిస్తారు..

- కొత్త శ్రీనివాస్, ఇల్లందకుంట



మరో నాలుగు రోజులైతే బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. కానీ ఇప్పటి వరకు ప్రచార రథాలు ప్రారంభించలేదు. ఇతర జిల్లాల నుంచి భక్తులు స్వామివారి కల్యాణానికి అధిక సంఖ్యలో వస్తారు. భక్తులకు సమాచారం అందించడంలో అధికారులు జాప్యం చేయడం సరికాదు.

ముమ్మాటికి అధికారుల నిర్లక్ష్యమే.

- కొత్త శ్రీనివాస్, ఇల్లందకుంట



మరో నాలుగు రోజులైతే బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. కానీ ఇప్పటి వరకు ప్రచార రథాలు ప్రారంభించలేదు. ఇతర జిల్లాల నుంచి భక్తులు స్వామివారి కల్యాణానికి అధిక సంఖ్యలో వస్తారు. భక్తులకు సమాచారం అందించడంలో అధికారులు జాప్యం చేయడం సరికాదు.

ఆటో-ద్విచక్రవాహనం ఢీ

● యువకుడు మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మంతునిపేట గ్రామశివారులో శనివారం సాయంత్రం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. హన్మంతునిపేట గ్రామానికిచెందిన అజయ్(23) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై పెద్దపల్లికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. గ్రామంలో చిరుతల రామాయణంలో చురుకుగా పాల్గొని తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషాదం నెలకొంది.

గల్లంతైన చిన్నారి మృతదేహం లభ్యం

రామగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల శివారులోని ఇటుక బట్టీలో ఒడిశారాష్ట్రానికి చెందిన గెల్హి(2) అనే చిన్నారి మృతదేహం ఆదివారం లభ్యమైంది. శనివారం సాయంత్రం ఎస్‌ఆర్‌ఎస్‌పి, ఎల్‌ఎస్‌బి కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి గల్లంతైంది. కెనాల్‌లో నీటి సరఫరాను నిలిపివేసి శనివారం నుంచి గాలింపులు చేపట్టగా ఆదివారం ప్రమాదానికి నీట మునిగిన ప్రాంతం నుంచి 7వందల మీటర్ల దూరంలో చిన్నారి మృతదేహం నీటిపై తేలిందని ఎస్‌ఐ చంద్రకుమార్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు చిన్నారి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఓదెల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం బుద్దె కుమారస్వామి అనే రైతుకు చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందింది. సాయంత్రం మొక్కజొన్నపంట సమీపంలో గడ్డి మేస్తున్న సమయంలో కిందికు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్ ఎద్దుకు తాకడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు మృతితో రూ.50వేల మేరకు ఆర్థికనష్టం వాటిల్లిందని రైతు కుమారస్వామి తెలిపారు. ప్రమాదప్రాంతానికి విద్యుత్ అధికారులు సందర్శించి పరిశీలించారు.

అభ్యంతరకర పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని పలు వాట్సాప్ గ్రూపుల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టిన రామచంద్రపూర్ గ్రామానికి చెందిన బొడ్డు శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. తనను కించపరిచేవిధంగా బొడ్డుశ్రీధర్ పోస్టులు పెట్టాడని చిన్న లింగపూర్ గ్రామానికి చెందిన బైరినేని రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఆదివారం నిందితునివద్ద నుంచి మొబైల్‌ఫోన్ స్వాధీనపర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా, వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏఎంసీ కార్యదర్శి, సెక్యూరిటీగార్డుల రిమాండ్

కరీంనగర్ క్రైం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో పండ్ల వ్యాపారుల నుంచి 60వేల రూపాయలు లంచం తీసుకుంటూ శనివారం ఏసీబీకి చిక్కిన కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎ పురుషోత్తం, సెక్యూరిటీగార్డు శ్రీనివాస్ రెడ్డిని రిమాండ్‌కు తరలించారు. శనివారం ఇదరిని అదుపులోకి తీసుకున్న కరీంనగర్ ఏసీబీ పోలీసులు విచారణ అనంతరం ఆదివారం కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో కరీంనగర్ జిల్లా జైలుకు 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతుందని ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి తెలిపారు.

ఈత సరదా.. కారాదు విషాదం..

- వేసవిలో చెరువులు, కాలువల వద్ద పొంచి ఉన్న ప్రమాదాలు
- పిల్లలను జాగ్రత్తగా గమనించాలని నిపుణుల సూచన

జగిత్యాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఈల కొలనుల్లో, చెరువులు, కుంటల్లో ఈత కొట్టడం చాలా మంది పిల్లలకు సరదాగా ఉంటుంది. కానీ తగు జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. జగిత్యాల జిల్లాలో ప్రధానంగా ఎస్సారెస్పీ కాకతీయ కాలువ, వరద కాలువ అనుబంధ కాలువల్లో పిల్లలు ఈత కొడుతుంటారు. అజాగ్రత్తగా వ్యవహరిస్తే ఈతకు వెళ్లిన వారు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు సైతం ఉన్నాయి.





● జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటన

గొల్లపల్లి మండలం రంగదాముని పల్లె రిజర్వాయర్‌లో కొద్ది రోజుల క్రితం ఈతకు వెళ్లి ఎనిమిదో తరగతి బాలుడు నేరెళ్ల నరేష్(12) మృతిచెందాడు. ఒంటిపూట బడి అయిపోగానే తోటి మిత్రులతో కలిసి రిజర్వాయర్‌లోకి ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. మిత్రులు చెరువు కట్ట మీద నుంచి ఒక చోట చెరువులోకి దిగి ఈత కొడుతుండగా నరేష్‌కు ఈత రాకపోవడంతో మరోచోట నుంచి రిజర్వాయర్‌లోకి దిగాడు. కాసేపటికి అందులో మునిగి మృతిచెందాడు.

● తల్లిదండ్రులూ..తస్మాత్ జాగ్రత్త

ఈత రాని పిల్లలను తల్లిదండ్రులు ఒంటరిగా పంపకూడదు. పిల్లలతో పాటు తల్లిదండ్రులు తప్పకుండా వెళ్లాలి. ఎంత లోతుకు వెళ్లి ఈత కొట్టాలో ముందే జాగ్రత్తగా చెప్పాలి. పిల్లలు చెరువులు, కుంటలు, కాలువలు, స్విమ్మింగ్‌ఫూల్స్‌లో ఈత కొడుతున్నంత సేపు పెద్దలు జాగ్రత్తగా గమనించాలి. ఈత నేర్చుకునేటప్పుడు లైఫ్ జాకెట్లు ధరించేలా చూడాలి. నిపుణల పర్యవేక్షణలో ఈతను నేర్పాలి. చెరువుల్లో చేపల కొరకు వేసిన వలలు ఉంటాయి. వాటిల్లో చిక్కుకునే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా వ్యవహరించాలి. చెరువుల్లో బురద అధికంగా ఉన్న ప్రాంతాల్లో కాళ్లు పూడుకపోయి పైకి వచ్చే పరిస్థితి ఉండదు. కాలువల్లో నీటి ప్రవాహ వేగం అంచనా వేయకపోతే ప్రమాదాలు చోటుచేసుకుంటాయి.

● ప్రమాదాలు జరిగితే..

చెరువులు, కుంటలు, కాలువల్లో పడి చిక్కుకుపోయిన వారిని బయటకు తీయగానే వెల్లకిలా పడుకోబెట్టాలి. పొట్టపై మెల్లిగా నొక్కి నీటిని బయటకు తీయాలి. బాధితుడికి శ్వాస ఆడకపోతే తోటి వ్యక్తులు నోటి ద్వారా శ్వాస అందించాలి. గుండె కొట్టుకోకుంటే చాతిపై నొక్కాలి. వీలైనంత త్వరగా సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

కుటుంబాన్ని బెదిరించిన వ్యక్తిపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇంట్లో చొరబడి ఓకుటుంబాన్ని బెదిరించిన కేసులో గుగు లోతు కుమార్‌నాయక్‌పై గోదావరిఖని టూటౌన్‌పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం కుమార్ నాయక్ మరో పదిమందితో కలసి హనుమాన్‌నగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి ఇంట్లో చొరబడి దాడికి యత్నిం చాడు. భాగ్యలక్ష్మి కుమారుడుకి వచ్చిన సింగరేణి టెండర్‌ను వదులు కోవాలని, లేదంటే కుటుంబం మొత్తాన్ని చంపుతానంటూ బెదిరించాడు.

భాగ్యలక్ష్మిపై దుర్భాషలాడుతూ దాడికి యత్నించాడు. కుమార్ నాయక్‌తో తన కుటుంబానికి ప్రాణహాని ఉన్నదని భాగ్యలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఆదివారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు కుమార్ నాయక్‌పై కేసునమోదు చేశారు.

గ్రూపు-1లో మెరిసిన యువత



నక్క శృతిహర్షిత, కన్నం హరిణి, పాలకుర్తి సందీప్

సుభాష్‌నగర్/కరీంనగర్ టౌన్/కరీంనగర్ క్రైం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన గ్రూపు-1 ఫలితాల్లో కరీంనగర్‌కు చెందిన యువతీ యువకులు మెరిసారు. జిల్లా కేంద్రానికి చెందిన నక్క శృతిహర్షిత జనరల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంకు, మల్టీజోన్ స్థాయిలో 6వర్యాంకు సాధించారు. శృతిహర్షిత అలహాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్‌ఐటీ) బీటెక్ పూర్తి చేశారు. సివిల్స్‌కోసం కూడా సిద్ధమవుతున్నారు. తండ్రి బాలయ్య వైద్యఆరోగ్యశాఖలో హెల్త్ ఎడ్యూకేటర్ ఆఫీసర్‌గా, తల్లి సరస్వతి కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కలెక్టర్ కావాలనేది తన లక్ష్యమని, ప్రస్తుతం తనకు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వచ్చే అవకాశం ఉందని శృతిహర్షిత పేర్కొన్నారు.

కన్నం హరిణికి 55వ ర్యాంకు..

- ఎస్సీ కేటగిరీలో స్టేట్ ఫస్ట్

కరీంనగర్‌కు చెందిన కన్నం హరిణి 499.5 మార్కులతో జనరల్ కేటగిరీలో రాష్ట్రస్థాయిలో 55వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. కరీంనగర్ ట్రినిటీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్, ఎన్‌ఐటీ వరంగల్‌లో ఈఈఈలో చేరి బీటెక్ పూర్తి చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరారు. ఐఏఎస్ కావాలనే లక్ష్యం పెట్టుకున్న హరిణి రెండేళ్లు ఉద్యోగం చేసిన తర్వాత రాజీనామా చేసి ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకుంటూ సివిల్స్‌కు సిద్ధమవుతున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షకు హాజరయ్యారు. గ్రూప్-1 పరీక్ష రాసిన హరిణి రాష్ట్రస్థాయిలో జనరల్ కేటగిరిలో 55వ ర్యాంకు, ఎస్సీ కేటగిరిలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. గ్రూప్-1 ఉద్యోగంలో చేరినా ఐఏఎస్ లక్ష్యంగా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతానని చెప్పారు. బోయినపల్లి మండలం అనంతపల్లికి చెందిన హరిణి తల్లిదండ్రులు కళాప్రపూర్ణ జ్యోతి, కన్నం రమేశ్ ఇద్దరూ స్కూల్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసముంటున్నారు. హరిణికి ఒక అక్క, చెల్లె, తమ్ముడు ఉన్నారు. అక్క ఇప్పటికే డాక్టర్‌గా కొనసాగుతుండగా, చెల్లె ఎంబీబీఎస్ చదువుతున్నారు. తమ్ముడు డాక్టర్ లక్ష్యంగా నీట్‌కు ప్రిపేర్ అవుతున్నారు. గ్రూప్-1లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన కన్నం హరిణి, ఆమె తల్లిదండ్రులు కళాప్రపూర్ణ, రమేశ్‌ను బహుజన టీచర్స్ ఫెడరేషన్ (బీటీఎఫ్) పక్షాన రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేశ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చిలుక దేవశంకర్, ఉపాధ్యక్షుడు బేజగం రమేశ్, మనుపాటి రాజయ్య, మేకల స్వరూప తదితరులు అభినందించారు.

పాలకుర్తి సందీప్‌కు 80వ ర్యాంకు..

గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో కరీంనగర్‌కు చెందిన పాలకుర్తి సందీప్ రాష్ట్రస్థాయిలో 80వ ర్యాంకు సాధించారు. సందీప్ తండ్రి కాశయ్య, కరీంనగర్‌లో సీసీఎస్ ఏసీపీగా పని చేస్తున్నారు. తల్లి భాగ్యలక్ష్మి గృహిణి. కరీంనగర్‌లోని వాణినికేతన్‌లో పదోతరగతి, అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివిన సందీప్ తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్, హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చేశారు. నాలుగు నెలల క్రితం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో ఏవోగా విధుల్లో చేరారు. గ్రూప్-1లో 80వ ర్యాంకు రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

గ్రూపు-1లో గంభీరావుపేట ఎస్‌ఐకి 89 ర్యాంక్



శ్రీకాంత్

గంభీరావుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) గ్రూపు-1లో గంభీరావుపేట ఎస్‌ఐ శ్రీకాంత్ రాష్ట్రస్థాయిలో 89వ ర్యాంక్ సాధించారు. ఎస్టీ కేటగిరీలో మల్టీజోన్ పరిధిలో శ్రీకాంత్ మూడో ర్యాంక్ సాధించారు. ఎస్‌ఐ శ్రీకాంత్ ఓవైపు తన విధులను నిర్వహిస్తునే గ్రూపు-1 పరీక్షకు సన్నద్ధమై 489 మార్కులు సాధించాడు. హుస్నాబాద్ మండలం పూల్‌నాయక్ తండాకు చెందిన శ్రీకాంత్‌ది ముందు నుంచి వ్యవసాయ కుటుంబమే.

పోతారంలో 10వ తరగతి వరకు, బాసర ట్రిబుల్ ఐటీలో బీటెక్ చేశారు. వీఆర్‌వోగా, పంచాయితీ కార్యదర్శిగా కొలువులు సాధించి, కొంతకాలం సిద్దిపేట జిల్లాలో విధులు నిర్వహించాడు. 2020లో ఎస్‌ఐ ఉద్యోగం సాధించి, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బొయినపల్లి, చందుర్తి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం గంభీరావుపేట ఠాణాలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ మొక్కవోని దీక్షతో చదివి గ్రూప్-1 రాష్ట్రస్థాయిలో 89వ ర్యాంక్ సాధించాడు.

ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి

● అస్తవ్యస్తంగా విస్తరణ పనులు ● కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు



మానకొండూర్‌లో ప్రమాదకరంగా ప్రయాణం



మానకొండూర్‌లో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



తాడికల్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన ప్యాసింజర్ ఆటో(ఫైల్)

మానకొండూర్/శంకరపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి వరంగల్ వరకు నిర్మిస్తున్న 563 జాతీయ రహదారి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. మానకొండూర్, శంకరపట్నం మండలాల్లో 20 కిలోమీటర్ల మేర రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారు నుంచి వెల్లుతున్న ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వపై నిర్మించిన ఇరుకు వంతెన కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చెంజర్ల బస్టాండ్ వద్ద ఫైఓవర్ ఫైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో నుంచి వెల్లుతున్న ఎస్సారెస్పి కాకతీయ ప్రధాన కాల్వపై నిర్మించి ఇరుకు వంతెన ప్రమాదాలకు నిలయంగామారింది. శంకరపట్నం మండలంలో ఎన్‌హెచ్-563కొత్తగట్టు శివారులో ప్రారంభమై తాడికల్‌శివారుతో ముగుస్తుంది. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలకు గురై పలువురు మృతిచెందారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. ఓవైపు జాతీయరహదారి విస్తరణ పనులు నడుస్తున్నాయి. ఈ పనులు అస్తవ్యస్థంగా ఉండడం, పనులు జరిగేచోట సరైన సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇన్ని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేషనల్‌హైవే అథారిటీ అధికారులు ఏ విధమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడం లేదనే విమర్శలు వినిపి స్తున్నాయి. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటిని ప్రమాద జోన్లుగా నిర్ధారించి కాషన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరతున్నారు.

● ఇటీవల జరిగిన ప్రమాదాలు

⇨ శంకరపట్నం మండలం మక్తకు చెందిన షేక్‌అజీమ్ (35), అతని కుమారుడు అబ్దుల్ రహ్మాన్ (10)లు మోటర్ సైకిల్‌పై కేశవపట్నం నుంచి మక్తకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై కేశవపట్నం బస్టాండ్ సమీపంలో వరంగల్ నుంచి కరీంనగర్ వెళ్తున్న లారీ బైక్‌ను ఎదురుగా ఢీ కొట్టడంతో తండ్రి, కొడుకులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వీరితో పాటు రోడ్డు పక్కన బైక్‌పై వెళ్తున్న మాందాడి శ్రీనివాస్‌రెడ్డికి తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు.

⇨ శంకరపట్నం మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన దండు కొంరయ్య తన స్వగ్రామం నుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్నాడు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై మొలంగూర్ పెట్రోల్ బంకు ఎదురుగా డేనియల్ అనేవ్యక్తి కొంరయ్య బైకును వెనుకనుంచి ఢీ కొట్టాడు. దీంతో కొంరయ్య తలకు, కుడి కాలుకు గాయాలు కాగా, డేనియల్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

⇨ హనుమకొండకుచెందిన గుడిపాటి భూపాల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి-రమాదేవి, సునీత, మానస, సుజాత, అయాన్ష్‌తో కలిసి కారులో కరీంనగర్‌లో ఓ వివాహానికి హాజరై తిరిగి హనుమకొండకు వెళ్తున్నారు. ఈక్రమంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్, వంకాయ గూడెం గ్రామాల మధ్య కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను, ప్యాసింజర్ ఆటోను, ట్రాలీ ఆటోను ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇన్నోవా ప్యాసింజర్ ఆటోను బలంగా ఢీ కొట్టడంతో ఆటో నుజ్జునుజ్జయింది. ఆటో డ్రైవర్ మానకొండూర్ మండలం గంగిపల్లికి చెందిన రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

⇨ హుజూరాబాద్ మండలం రాజపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ హైమద్ తన వ్యక్తిగత అవసరాల రీత్యా కేశవపట్నం వచ్చి తన స్వగ్రామం రాజపల్లికి వెళ్తుండగా మార్గ మధ్యలో కొత్తగట్టు వద్ద బైక్ అదుపు తప్పి ఒకసారిగా కింద పడడంతో తలకు, మోకాలుకు తీవ్రమైన గాయాలయ్యాయి.

⇨ శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై లారీ బైక్ ఢీ కొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన ముద్దమల్ల హరీస్ (23) లారీ బైక్ ఢీ కొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు.

⇨ శంకరపట్నం మండలం తాడికల్ శివారులో ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి.

⇨ శంకరపట్నం మండలం తాడికల్ శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి.

⇨ తాడ్వాయి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన 8మంది ట్రాలీ ఆటోలో వేములవాడ దైవ దర్శనానికి బయలుదేరారు. ఈ క్రమంలో వంకాయగూడెం వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గ్రానైట్ లారీ ఆటో ట్రాలీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ట్రాలీ ఆటోలో ప్రయాణిస్తున్న ఆనంద్‌వర్ధన్, సూర్యప్రకాష్, ఇషాని ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు.

⇨ శంకరపట్నం మండలంలోని మక్త గ్రామానికి చెందిన పంచకోటి గోపి (30) బైక్‌పైన వంకాయగూడెం గ్రామ శివారులోని ఓ హోటల్‌కు వెళ్లి సర్వపిండి తీసుకొని బైక్‌పై తన హార్వేస్టర్ రిపేర్ షాపు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా హుజూరాబాద్ వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీ కొట్టడంతో గోపి తలకు తీవ్రమైన గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు.

ఎప్పటికి పూర్తయ్యేనో..?

- అసంపూర్తిగా అదనపు తరగతి గదులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన పనులు ఇప్పటికీ పూర్తి కావడం లేదు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి కార్పొరేటు స్థాయిలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యను అందించేందుకు శ్రీకారం చుట్టినా ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. దీంతో శిథిలమైన తరగతి గదుల్లో విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొంది.



నిలిచిపోయిన తరగతి గదుల భవన నిర్మాణం

● నిలిచిన నిర్మాణాలు..

మండలంలోని రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, అల్మాస్‌పూర్, వెంకటాపూర్, రాజన్నపేట, బండలింగంపల్లి, రాచర్లగొల్లపల్లి, సింగారం గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గత ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' పథకం కింద ఎంపిక చేసి అభివృద్ధి పనులకు రూ.కోటి 57 లక్షల నిధులను కేటాయించింది. రెండేళ్ల కిందట పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు తరగతి గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు. పాత భవనాలను తొలగించి అదే స్థలంలో పనులను చేపట్టారు. అల్మాస్‌పూర్, వెంకటాపూర్, రాజన్నపేట, బండలింగంపల్లి, రాచర్లగొల్లపల్లి, సింగారం గ్రామాల్లో పనులు చివరి దశకు చేరుకున్నాయి. మంజూరైన నిధుల్లో రూ.61 లక్షలు చెల్లించగా, మిగతా రూ.21లక్షలు చెల్లించాల్సి ఉంది. రాచర్లబొప్పాపూర్‌లో రూ.49.96, నారాయణపూర్‌లో రూ.26 లక్షలు కలిపి మొత్తం రూ.75.96లక్షలు చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు అర్ధంతరంగా పనులను నిలిపివేశారు.

● నిర్మాణాలు నిలిచిపోయాయి.

బిల్లులు రాకపోవడంతో పనులను నిలిపివేశారు. గత ఏడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం పేరిట అదనపు తరగతి గదుల నిర్మాణాలను చేపట్టింది. గత ప్రభుత్వంలో చేపట్టిన తరగతి గదుల నిర్మాణాలకు బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదు. రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 445 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒకే గదిలో ల్యాబ్, గ్రంథాలయం, డెస్కులు ఉండగా, తరగతులను కూడా నిర్వహిస్తున్నారు. ఇరుకు గదిలో పాఠాలు వినేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేకపోవడం వల్ల పందులు, కుక్కలు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రయోగాలు చేయలేకపోతున్నాం..

- అల్లె ప్రణతి, 9వ తరగతి విద్యార్థిని, రాచర్లబొప్పాపూర్



పాఠశాలలో పాత తరగతి గదులను తొలగించి నిర్మాణ పనులను చేపట్టారు. యేడాది దాటినా పనులు పూర్తి కాలేవు. గదులు లేక ల్యాబ్ మూలకు పడింది. ప్రయోగాలు చేయలేకపోతున్నాం. అధికారులు స్పందించి తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేయాలి.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

- కృష్ణహరి, ఎంఈవో



గత ప్రభుత్వం 'మన ఊరు- మన బడి' కింద రెండేళ్ల తరగతి గదులు, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించింది. రాచర్లబొప్పా పూర్, నారాయణపూర్ గ్రామాల్లో పనులు నిలిచిపోయాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తయేలా చర్యలు చేపడుతాం.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలు

● ముగ్గురి పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆటో, ద్విచక్రవాహనం ఆదివారం రాత్రి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మండలంలోని నారాయణపూర్, హరిదాస్‌నగర్ గ్రామాలకు చెందిన యువకులు హఫీజ్, అఫ్రోజ్, రఘుపతితో పాటు మరో ఇద్దరు తీవ్రగాయాల పాలయ్యారు. రంజాన్ పండుగ సందర్భంగా నూతన దుస్తులు కొనుగోలు చేసేందుకు హఫీజ్, అఫ్రోజ్‌లు కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్ల వైపునకు వెళుతున్నారు. రఘుపతితో పాటు మరో ముగ్గురు ఆటోలో సిరిసిల్ల నుంచి హరిదాస్‌నగర్‌కు వస్తున్న క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి.

దీంతో హఫీజ్, అఫ్రోజ్, రఘుపతి పరిస్థితి విషమంగా ఉంది. హఫీజ్, అఫ్రోజ్‌ను ఎల్లారెడ్డిపేటకు, రఘుపతితో పాటు మరో ఇద్దరిని సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రహదారిపై ఉన్న వాహనాలను తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాలప్రకారం కేసన్నపల్లె గ్రామానికి చెందిన వడిజె అఖిల్ ఎలాంటి అనుమతులు లేకుండా శనివారం అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెవన్యూశాఖ అధికారులు దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా ఉగాది వేడుకలు

● ఆలయాల్లో కిక్కిరిసిన భక్తులు



ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గుపూజారులు

ఓదెల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్వస్తిశ్రీ విశ్వావసునామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు, పారాయణాలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున వచ్చిన వాహనాలకు పూజలు నిర్వహించారు. గతంలో నిర్వహించిన ఎడ్లబండ్ల ప్రదక్షిణలు కనబడలేదు. వాటి స్థానంలో వాహనాలకే రథాలను తయారుచేసి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. హరిపురం గ్రామానికి చెందిన యాదవ భక్తులు మేకల బండ్లతో ప్రత్యేక ప్రదక్షిణలు నిర్వహించారు. జమ్మికుంట, సుల్తానాబాద్, మంచిర్యాల, మందమర్రితో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి మొక్కులను సమర్పించారు. అలాగే పొత్కపల్లిలో రాజగోపాలస్వామి, భవాని సహిత మహా లింగేశ్వర స్వామి, మడకలో ఉమామహేశ్వర స్వామి, కనగర్తిలో శివాలయం, ఆంజనేయస్వామి, కొలనూర్ లో మల్లన్న గుట్ట వద్ద ఉగాది వేడుకలు, వాహనాల పూజలు నిర్వహించారు. అనంతరం మల్లన్న జాతరతోపాటు ఓదెల సీతారామచంద్రస్వామి, శివాలయం అలాగే గుంపుల రామభద్ర ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు భక్తి శ్రద్ధలతో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. ఇళ్ళ ముంగిట మహిళలు రంగవల్లులతో వాకిళ్లను అలంకరించి, పచ్చని తోరణాలతో ఉగాది వైభవాన్ని చాటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ఏఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో పొత్కపల్లి పోలీస్ సిబ్బంది బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ఉగాది వేడుకలకు దాదాపు 15 వేల మంది భక్తులు హాజరయ్యారు.



ఓదెల ఆలయంలో మేకలబండ్లతో భక్తుల ప్రదక్షిణలు

● టాటా వారి సహకారంతో ఏటీసీ సెంటర్ ఏర్పాటు

● 60వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ

నూతన కోర్సులతో ఐటీఐకి పూర్వ వైభవం



పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల

ప్రభుత్వ ఏటీసీ సెంటర్

పెద్దపల్లి కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం గత వైభవాన్ని సంతరించుకుంటోంది. 59 ఏళ్లు పూర్తిచేసుకుని 60వ యేట అడుగుపెడుతున్న ఈ ఐటీఐ ఉత్తర తెలంగాణకు ఒక ఎంప్లాయిమెంట్ కేంద్రంగా కీర్తి గడిచింది. కోల్‌బెల్ట్, ఎన్టీపీసీ, నాటి ఎఫ్‌సీఐ ఎరువుల కర్మగారానికి, రామగుండం థర్మల్ పవర్‌స్టేషన్‌లకు టెక్నికల్ ఉద్యోగులను అందించింది.

1964లో పెద్దపల్లిలో ప్రారంభమైన ఈ ఐటీఐకి టెక్నికల్ విద్యనభ్యసించే వారికి ఒక వరం ఉండేది. మొదట ఫిట్టర్, టర్నల్, మిషినిస్ట్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, ఆర్ అండ్ టీవీలకే పరిమితమైంది. ప్రస్తుతం ఈ ఐటీఐ అధునాతన కోర్సులకు స్వాగతం పలికింది. 20 ఎకరాల రెండు గుంటల్లో ఐటీఐ విస్తరించి ఉంది. ఇందులోనే జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం కూడా ఉంది. గతంలో కలెక్టర్ రేట్ ఉంటే దానిని సొంత భవనంలోకి మార్చారు.

● 646 మంది విద్యార్థులు

ఐటీఐలో ఎలక్ట్రిషన్ ఐదు యూనిట్లు, ఫిట్టర్ ట్రేడ్ రెండు యూనిట్లు, టర్నర్, మిషన్ ట్రేడ్, మోటార్ మెకానిక్ ట్రేడ్, వెల్డర్, కోపా, ఎలక్ట్రానిక్, డిజిల్ మెకానిక్ ట్రేడ్ రెండు యూనిట్ల చొప్పున నడుస్తున్నాయి. ఒక్కొక్క యూనిట్లో 20 నుంచి 22 మంది విద్యార్థులు ఉంటారు. విశాలమైన ప్రాక్టికల్ రూములు డ్రిల్ మిషన్స్ లేత్ మిషన్స్, గ్రైండింగ్ మిషన్స్ తదితర మిషన్‌లు అందుబాటులో ఉన్నాయి.



తరగతి గదిలో విద్యార్థులు

ఏటీసీ సెంటర్లో కొత్త కోర్సులు

పెద్దపల్లి ఐటీఐలో కొత్తగా నిర్మాణం చేసిన ఏటీసీ సెంటర్లో కొత్త కోర్సులు వచ్చాయి. అడ్వాన్స్‌డ్ సీఎస్‌సీ, అడ్వాన్స్‌డ్ టూల్ యూసింగ్‌తోపాటు బేసిక్ డిజైనర్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆటోమేషన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్స్ మొదలగు కొత్త కోర్సులు వచ్చినట్టు పేర్కొన్నారు.

● ఏటీసీ సెంటర్ నిర్మాణం

టాటా కంపెనీ వారు రూ.475 కోట్ల ఎస్టిమేషన్‌తో ఇక్కడ ఏటీసీ (అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్) నిర్మాణంతోపాటు దాన్ని నడిపించడానికి సిబ్బందిని నియమించారు. దీనిలో భాగంగా రూ.4.5 కోట్లతో ఏటీసీ భవన నిర్మాణం జరిగి రూ.33.5 కోట్లతో మిషన్ల ఏర్పాటు చేస్తున్నారు. దీనితోపాటు ముగ్గురు మాస్టర్లను కంపెనీ నియమించింది. ఏటీసీ సెంటర్‌కు 85 శాతం పెట్టుబడి టాటా కాగా, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది. సీఎస్ఆర్ ఫండ్స్ కింద రూ.14 లక్షలు కలెక్టర్ కేటాయించారు. ఏటీసీ సెంటర్‌లో ఆరు ట్రేడ్‌లు మూడు యూనిట్లను ఏర్పాటుచేశారు. రెండు సంవత్సరాల కోర్సులు ఒక సంవత్సరం కోర్సు కూడా ఉంది. అలాగే కలెక్టర్ కోయ శ్రీహర్ష ఐదు లక్షలు రా మెటీరియల్ సమకూర్చడంతోపాటు డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు.

● జిల్లాలో ఆరు ప్రైవేటు ఐటీఐలు వెయ్యి మంది విద్యార్థులు

జిల్లాలో రెండు ప్రభుత్వ ఐటీఐలతోపాటు ఆరు ప్రయివేటు ఐటీఐలు కూడా నడుస్తు న్నాయి. పెద్దపల్లిలో సింధూర, కాకతీయ, శివ సాయి ఐటీఐలు ఉండగా, గోదావరిఖని ప్రాంతంలో గౌతమి, శివశక్తి, సారథి ఐటీఐ ఉన్నాయి. వీటిలో సంవత్సరానికి వెయ్యి మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

● అభివృద్ధి.. సమస్యలు

పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐలో యేటా అప్రెంటీస్‌షిప్ నిర్వహిస్తున్నామని, ప్రతీసారి 200 మందికి అప్రెంటీస్‌షిప్ అందించి జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు కల్పిస్తున్నామని ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మధ్యనే 100 మందికి జాబ్ మేళాలో జాబ్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. రెండు వైపులా గేట్ల నిర్మాణం చేపట్టి వాకింగ్ ట్రాక్‌తో మైదానం కళకళ లాడుతుందన్నారు. కాంపౌండ్ వాళ్ళు ఒకచోట కూలిందని దాని నిర్మాణం తో పాటు రూ.14 లక్షల విద్యుత్ బకాయిలను చెల్లించాల్సి ఉందని అన్నారు.

● నూతన ట్రేడ్‌లకు అనుగుణంగా స్టాఫ్‌ను పెంచాలి

నూతన ఏటీసీ సెంటర్‌లో ఉన్న కొత్త ట్రేడ్లకు అనుగుణంగా స్టాఫ్‌ను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న స్టాఫ్ 50 ఏళ్ళ పైబడిన వారే ఉన్నారు. వారిలో కొందరు సీటీఐ చేసిన వారు, మరి కొందరు డిప్లమా, కొంత అవుట్ సోర్సింగ్ ద్వారా వచ్చిన వారు ఉన్నారు. ఏటీసీ సెంటర్‌లో వచ్చిన కొత్త కోర్సులకు అనుగుణంగా బీటెక్, ఏటీఐ, సీటీఐ నుంచి టెక్నికల్ స్టాఫ్ వస్తేనే న్యాయం జరుగుతుంది.

ఐటీఐ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

\- వెంకటరెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్, పెద్దపల్లి



పెద్దపల్లి ఐటీఐలో అందిస్తున్న కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న నూతన కోర్సులపై అవగాహన పెంచుకోని కోర్సులో చేరి ఉన్నత ఉద్యోగాలు సాధించాలి.

వేములవాడలో ఘనంగా ఉగాది వేడుకలు

● స్వామి వారికి ప్రత్యేక పూజలు ● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు



వేములవాడలో కన్నుల పండువగా స్వామివారి రథోత్సవం



శ్రీసీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు రాజరాజేశ్వరస్వామి వారితో పాటుగా అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేక పూజలు చేశారు. నూతన పంచాంగ పుస్తకాలను స్వామి వారి చెంతవుంచి పూజలు నిర్వహించారు. రాజన్న ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయ పరిసరాలను పూలతో అందంగా అలంకరించారు.

● **భక్తుల రద్దీ..**

ఉగాది నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు లక్ష్మీగణపతి, రాజన్నను, పార్వతిదేవి అమ్మవారిని దర్శించుకుని తరించారు. అనుబంధ ఆలయాల్లో అనంతపద్మనాభస్వామి, సీతరామచంద్రస్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొని తరించారు.

● **వైభవంగా స్వామివారి రథోత్సవం..**

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను అంబారి సేవపై పట్టణ వీధులగుండా ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

కొండగట్టులో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి చందనలంకారం, అభిషేకాలను ఆలయ అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. ఆలయ అధికారులు దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమర్పించారు. వెంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్రాభిషేకం నిర్వహించారు.

ఆదివరాహస్వామి సన్నిధిలో..

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఆదివరహస్వామి సన్నిధిలో ఆదివారం ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి పూజలు చేశారు. వాహనదారులు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఆచార్యులు కలకుంట్ల వరప్రసాద్ పంచాంగ శ్రవణం చేశారు. కమాన్‌పూర్ పిరమిడ్ స్వచ్ఛంద సంస్థవారు భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరుగకుండా టూటౌన్ సీఐ ప్రసాదరావు, ఎస్ఐలు కె.ప్రసాదరావు, రవళి, ఏఎస్ఐ బాలజీ, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, ఆర్‌జీ 2 జీఎం సుధాకర్‌రావు, యూట్యూబర్ వర్షిని, ముత్యాల దామోదర్, ఇనుగంటి రామారావు, కిషన్‌రెడ్డి తదితరులు ఉగాది ఉత్సవాలలో పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల పూజలు..

ధర్మపురి: లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ దేవాలయాల్లో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచియే పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతిధ్వనించాయి. రాత్రి వరకు భక్తులతో ఆలయాల్లో రద్దీ నెలకొంది.



కమాన్‌పూర్: ఆదివరాహస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, కొండగట్టులో ఘనంగా పంచాంగ శ్రవణం



కొండగట్టులో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

ధర్మపురి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి దేవాలయం ఆవరణలో గల శేషప్ప కళావేదికపై ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవ మూర్తులను శేషప్ప కళా వేదికపై తీసుకువచ్చారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేకపూజలు జరిపారు. ఈ సందర్భంగా ప్రముఖ జ్యోతిష్య పండితులు బుగ్గారపు రాజేంద్రప్రసాద్‌శర్మ నూతన శ్రీ విశ్వావసునామ సంవత్సర పంచాంగం పఠించారు. ఏడాదిలో రాశులకు సంబంధించిన ఆదాయ, ధన, వ్యయ, అధికారం, రాజయోగంతోపాటు ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు, పంటలు, ఫలాల గురించి వివరించారు. జ్యోతిష్యపండితులు బుగ్గారపు రాజేంద్రప్రసాద్‌శర్మను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మకర్తలు ఒజ్జల సౌజన్య, బాదినేని వెంకటేష్, రాపర్తి సాయికుమార్, గుడ్ల రవీందర్, నేదునూరి శ్రీధర్, బొల్లారపు పోచయ్య, స్తంభంకాడి గణేష్, మందుల మల్లేష్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక వేదికపై ఆలయ ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్ పంచాంగశ్రవణం చేయగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నివేదన కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్ రావు, ప్రధానర్చకులు రామకృష్ణ, రఘు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, ఆలయఅర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం కొండపైన రూ.35 లక్షలతో చేపడుతున్న జీఐ షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యం భూమి పూజ చేశారు.



ఉగాది పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలయ చైర్మన్, ఆలయ ఈవో, ప్రముఖులు, భక్తులు

తాగునీటి కోసం పోచమ్మతండా వాసుల ఆందోళన



బిందెలు, డ్రమ్ములు, బకెట్లతో ఆందోళన చేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామ పంచాయతీ పరిధిలోని పోచమ్మతండా గిరిజన మహిళలు ఆదివారం తాగునీటి కోసం ఆందోళన చేశారు. తండాలో 16 కుటుంబాలు జీవిస్తున్నాయని, తాగేందుకు నీటికి తల్లాడిల్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. చుక్కనీరు లేక పండుగ పూట పనులు చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తంచేశారు. పదిహేను రోజులనుంచి తండాలో తాగునీటికి ఇబ్బం దులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి తాగునీటి సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామ పంచాయతీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలను ముట్టడిస్తామని మహిళలు హెచ్చరించారు.

బీర్‌పూర్‌లో ఎడ్లబండ్ల పోటీలు



ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

బీర్‌పూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఎడ్లబండ్ల పోటీలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్‌రావ్, సారంగాపూర్ మాజీసర్పంచ్ గుర్రాల రాజేందర్ రెడ్డి, గోణె రమణ రావ్, మాజీ ఉపసర్పంచ్ హరీష్, కృష్ణరావ్, నేరెళ్ల సుమన్, శ్రీనివాస్, రాజేశం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంటలను కాపాడాలని అంజన్నకు ముడుపు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న రైతులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సాగుచేసిన పంటలను కాపాడాలని వేడుకుంటూ ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో రైతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు వేణుగోపాలచారి ఆధ్వర్యంలో పూజలు జరిపించారు. వడగళ్ల వానలు కురవకుండా పంటలను రక్షించాలని ముడుపు వేశారు. ప్రతి యేటా ఉగాది పండుగ రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపు వేయడం అనాదిగా వస్తున్న ఆచారమని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ హన్మండ్లు, మాజీ సర్పంచులు నర్సయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు మల్లారెడ్డి, నర్సయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'విశ్వావసు'కు ఘన స్వాగతం





మహాశక్తి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, విద్యానగర్‌లో హాజరైన అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కొండపల్కలలో పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే సత్యనారాయణ

- ఊరూరా ఉగాది సంబరాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం
- హాజరైన ప్రముఖులు

కరీంనగర్ రూరల్, మార్చి30(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు 'విశ్వావసు' నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. ఉగాది సందర్భంగా కరీంనగర్ మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం ఉదయం నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వేద పండితులు పంచాంగం చదివి వినిపించారు. దుర్గా భవానీ ఆలయంలో మహేశ్వర శర్మ, నగునూర్ సత్యనారాయణ స్వామి దేవాలయంలో పండితుడు లచ్చన్న, చెర్లబూత్కూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో సుధాకర్ శర్మ, గోపాల్‌పూర్, ఇరుకుల్ల, దుర్శేడ్, బొమ్మకల్, చేగుర్తి, చామనపల్లి, జూబ్లీ గ్రామాల్లోని దేవాలయాల్లో పండితులు పంచాంగం చదివి వినిపించారు. నగునూర్ జగన్నాథుని గుట్టపై సాయంత్రం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నిస్వర్థ యూత్ సభ్యులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని హౌసింగ్ బోర్డుకాలనీ వీరబ్రహ్మేంద్రస్వామి అనాథ వృద్ధుల ఆశ్రమంలో అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు డాక్టర్ పి.సుజాతరెడ్డి ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సరాదికి స్వాగతం పలికారు. ఏసీపీ గంగాధర్, బీజేపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: సప్తగిరి కాలనీ కోదండ రామాలయంలో కొనసాగుతున్న వసంత నవరాత్రోత్సవాల్లో శ్రీవైష్ణవ సేవా సంఘం పంచాంగాన్ని త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ఆవిష్కరించారు.

నగరకాంగ్రెస్ కార్యాలయంలో..

కరీంనగర్ అర్బన్ : నగర కాంగ్రెస్ కార్యాలయంలో పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమం నిర్వహించారు. సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. అనం తరం వేదబ్రాహ్మణుడు రామకృష్ణాచార్యులు పంచాంగశ్రవణం చేశారు.

● కరీంనగర్ పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో ముకరంపురలోని పద్మనాయక కల్యాణ మండపంలో వేదపండితుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మి నర్సింహారావు, మాజీ ఎమ్మెల్యే రేగులపాటి పాపారావు వెలమ సంఘం అధ్యక్షుడు జువ్వాడి వేణుగోపాల్‌రావు, ఉపాధ్యక్షుడు గండ్ర సంపత్ రావు, ప్రధానకార్యదర్శి చీటి ప్రకాష్‌రావు, సంయుక్త కార్యదర్శి భూపతిరావు, కోశాధికారి భీంరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

● విద్యానగర్‌లోని రెడ్డి సంక్షేమ సంఘం నూతన భవనంలో వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడుడాక్టర్ వి.నరేందర్‌రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరయ్యారు.

●ఆదర్శనగర్ జెండా చౌరస్తాలో ఆదర్శనగర్ అభివృద్ధి కమిటీ, గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, బక్షాలను పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ వైద్యుల శ్రీదేవి అంజన్‌కుమార్, కమిటీ కార్యదర్శి కాసర్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో

భగత్‌నగర్: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలోని హనుమాన్ దేవాలయంలో విశ్వావసు నామ సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సుభిక్షంగా ఉండాలని,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అన్నారు.

సుభాష్‌నగర్: మేముసైతం యువసేన ఫౌండేషన్, ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఫౌండేషన్, సంఘం అధ్యక్షురాలు చకిలం స్వప్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్/హుజూరాబాద్ రూరల్/శంకరపట్నం/సైదాపూర్/గంగాధర/జమ్మికుంట/తిమ్మాపూర్/ఇల్లందకుంట/చొప్పదండి/గన్నేరువరం/వీణవంక : మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రజలు దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. చొప్పదండిలోని జ్ఞానసరస్వతీ ఆలయంలో పంచాంగ శ్రవణంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు.

హుజూరాబాద్ క్లబ్‌లో మాజీఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వాసవి కన్యకాపరమేశ్వరి, శివాలయం, రామాలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు. కాంగ్రెస్ కార్యాలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఇల్లందకుంట సీతారామ చంద్రస్వామి దేవాలయంలో సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు విశ్వావస సంవత్సరంపై భక్తులకు వివరించారు. గన్నేరువరం మండలంలోని ఖాసింపేట మాన సాదేవి ఆలయం, మైలారం మల్లికార్జునస్వామి, గన్నేరువరం లక్ష్మీనర సింహస్వామి, పారువెల్ల లక్ష్మీగణపతి ఆలయాలు ఉగాది శోభ సంతరించుకున్నాయి.

విద్యాభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యే

మానకొండూర్: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కొండపల్కల గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం పురోహితులు నమిలికొండ రఘురామాచార్యుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు విశ్వావసునామ సంవత్సర, ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కొండపల్కలలో కోటికి పైగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, నందగిరి రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో పూజలు నిర్వహిస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి



పద్మనాయక కల్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్యే రేగులపాటి పాపారావు, బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనర్సింహారావు



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న అహోబిల రామానుజ జీయర్‌స్వామి



ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఆదర్శనగర్ అభివృద్ధి కమిటీ

ఘనంగా ఉగాది సంబరాలు

(5వ పేజీ తరువాయి)

సకల శుభాలు చేకూరాలన్నారు.

యజ్ఞ వరాహక్షేత్రంలో ఉస్మానియా, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జ్యోతిష విభాగ అధ్యక్షురాలు, జ్యోతిర్వాస్తు విజ్ఞాన మాస పత్రిక సంపాదకురాలు డాక్టర్ ఎస్.ప్రతిభ పంచాంగం చదివారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కుటుంబ సభ్యులు, సర్వ వైదిక సంస్థానం ట్రస్టు మేనే జింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ, సభ్యులు, మాజీ మాజీ ఎమ్మెల్యే వుచ్చిడి మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కోల మాలతి సంపత్‌రెడ్డి, గందె మహేశ్, బోనాల శ్రీకాంత్, ఒంటెల సత్యనారాయణరెడ్డి, ఏలేందర్ యాదవ్, కర్ర సూర్య శేఖర్, కలర్ సత్తన్న పాల్గొన్నారు.

అశోక్‌నగర్ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పారువెల్ల ఫణిశర్మ పంచాగ పఠనం చేయగా ఆలయ అధ్యక్ష కార్యదర్శులు చిట్టుమల్ల శ్రీనివాస్, కాచం రాజేశ్వర్, కోశాధిరకారి బొల్లం శ్రీనివాస్, సంకష్టి కన్వీనర్ రాచమల్ల భద్రయ్య, సభ్యులు పాల్గొన్నారు. భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని ఆలయ సముదాయంలో ఆలయ చైర్మన్ యాంగండ్ల అనిల్‌కుమార్, సభ్యులు, ఈవో కాంతారెడ్డి పాల్గొన్నారు. శ్రీపురంలో భక్తాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంచాంగ పఠనం జరిగింది. శ్రీరాంనగర్ కాలనీ శ్రీరామ మందిరంలో సముద్రాల విజయసారథి పంచాంగ పఠనం చేయగా అధ్యక్ష కార్యదర్శులు మాధవరావు, గజవాడ ఆంజనేయులు, కోశాధికారి నరసింహాచార్య, సభ్యులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డె శ్రీనివాస్ ఆధ్వర్యంలో రోడ్డుపై నివసిస్తున్న పేదవారికి బక్శాలను పంపిణీ చేశారు. 33వ డివిజన్‌లో హెలీప్యాడ్ గ్రౌండ్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సత్యనారాయణశర్మ పంచాంగ పఠనం చేయగా మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'విశ్వావసు ఉషస్సులు' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక హౌసింగ్‌బోర్డ్ కాలనీలో ఆదివారం కవి, ఉపాధ్యాయుడు కేవీ గోపాలాచార్య రచించిన 'విశ్వావసు ఉషస్సులు' పుస్తకాన్ని రచయిత, విమర్శకుడు దాస్యం సేనాధిపతి ఆవిష్కరించారు. భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.

సప్తగిరి కాలనీ రామాలయంలో ప్రవచనం

కరీంనగర్ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సప్తగిరి కాలని కోదండ రామాలయంలో జెట్, వికాసతరంగిణి ఆధ్వర్యంలో వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా శ్రీమద్రామాయణ కావ్యంపై త్రిదండి అహోబిల రామానుజ జీయరుస్వామి ఆదివారం ప్రవచనం ప్రారంభించారు. వికాసతరంగిణి జిల్లా అధ్యక్షుడు కె గౌతమరావు, సభ్యులు పాల్గొన్నారు.

అర్చకులకు రాష్ట్ర స్థాయి ఉగాది పండిత పురస్కారాలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన ఇద్దరు అర్చకులు ఉగాది రాష్ట్ర స్థాయి పండిత పురస్కారాలను అందుకున్నారు. మంకమ్మతోట వేంకటేశ్వరాలయం అర్చకుడు, జిల్లా అర్చక ఉద్యోగ సంఘం ఉపాధ్యక్షుడు పీచర నరసింహాచార్య పాంచరాత్ర ఆగమ విభాగంలో, కొత్తపల్లి ఆసిఫ్‌నగర్, భక్తాంజనేయస్వామి ఆలయ డీడీఎన్ అర్చకుడు పాటిమెట్ల శివప్రసాద్ వీరశైవాగమ విభాగంలో పురస్కారాలకు ఎంపికయ్యారు. ఉగాది సందర్భంగా ఆదివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నత అధికారుల పురస్కారాలను ప్రదానం చేశారు.

మున్నూరుకాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

సుభాష్‌నగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): విద్యానగర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను ఉగాది సందర్భంగా ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కనకం అమర్‌బాబు మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ నాయకుడు చల్ల హరిశంకర్ వారివారి కార్యాలయాల్లో క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. ప్రధానకార్యదర్శి అట్టపెల్లి శ్రీనివాస్, కోశాధికారి రాంమోహన్, గౌరవాధ్యక్షుడు నర్సయ్య పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా

తిమ్మాపూర్/గంగాధర, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో మాజీసర్పంచ్ బీఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేష్ ముస్లింలకు రంజాన్ సందర్భంగా చీరలను, నిత్యావసర సరుకులను అందజేశారు. గంగాధర మండలంలోని మంగపేటలో ముస్లింలకు జయపాల్‌రెడ్డి మిత్రమండలి రేషన్‌కిట్లను అందించింది.

మానకొండూర్‌లో ఇఫ్తార్ విందు

మానకొండూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని పెద్ద మసీద్‌లో ఆదివారం రాత్రి ముస్లింలకు రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ శర్ఫొద్దీన్, సభ్యులు ఎండీ అజీద్, ఎండీ సిరాజ్, సదక్, ఫరీద్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీబాత్ వీక్షించిన బీజేపీ నాయకులు



మన్‌కీబాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు

భగత్‌నగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని 39వ డివిజన్‌లో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు బీజేపీ శ్రేణులతో కలిసి ఆదివారం టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు న్యాత ప్రవీణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని 17వ డివిజన్ విద్యానగర్ కాలనీ 366 బూత్ అధ్యక్షుడు చంద్రగిరి వేణు ఆధ్వర్యంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్నం ప్రకాష్, రవికుమార్, వరాల దేవేందర్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

57వ డివిజన్‌లో మామిడి చైతన్య, మామిడి రమేష్, పవన్‌కృష్ణ, 37వ డివిజన్‌లో గాజుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో మన్‌కీబాత్ వీక్షించారు.

మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని 269, 370 బూత్‌లో బీజేపీ నాయకులు వీక్షించారు. నాయకులు బండ రమణారెడ్డి, నరహరి లక్ష్మా రెడ్డి, న్యాలకొండ ప్రసన్నరెడ్డి, ఇన్‌రెడ్డి తిరుమల్ రెడ్డి, చందర్ పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

జమ్మికుంట రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని స్పందన అనాథ శరణాలయం విద్యార్థులకు సేవ్‌ది ట్రీస్ గౌరవ అధ్యక్షుడు, సామాజికకార్యకర్త వర్ధినేని రవీందర్‌రావు-లక్ష్మి దంపతులు ఆదివారం దుస్తులు అందజేశారు. అదేవిధంగా పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



తుమ్మనపల్లిలో పోచమ్మ బోనాలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

హుజూరాబాద్ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్థులు పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని, డప్పు చప్పుళ్ల, శివసత్తులతో పోచమ్మ దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు సమర్పించారు.

ఉద్యోగులు మారినా.. పేర్లు మారలేదు..



పట్టికలో పాత అధికారుల పేర్లు

రామడుగు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు మారిన బోర్డులో మాత్రం వారి పేర్లు మారలేదు. ఇది ప్రత్యేక అధికారుల పాలన పనితీరు. రామడుగు మండలం వెదిర గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సూచిక పట్టికలో గతంలో ఉన్న అధికారుల పేర్లు ఉన్నాయి. గ్రామ కార్యదర్శి గౌరి రమేష్ ఇక్కడి నుంచి బదిలీ అయ్యి చాలా కాలమైనప్పటికీ ఆయన పేరు అలాగే కొనసాగుతోంది. అలాగే ప్రత్యేక అధికారి ఆర్ఐ రజినీ బదిలీ అయి నెలలు గడుస్తున్నా ఆమె పేరు సూచిక పట్టిలో భద్రంగా ఉంది. పల్లెప్రగతి ప్రత్యేక అధికారి, వీఆర్వో, లైన్‌మెన్, జడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ టీచర్ ఇలా చెప్పుకుంటూపోతే చాలా పేర్లు అలానే ఉన్నాయి. ఇక్కడ ఇంకో విచిత్రం ఏంటంటే తహసీల్దార్ ఈ గ్రామానికి ప్రత్యేక అధికారిగా కొనసగుతున్నప్పటికీ గతంలో ఉన్న ఆర్ఐ పేరే కనిపిస్తోంది. ప్రత్యేక అధికారుల పాలన ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీన్ని మార్చాల్సిన ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి పంచాయతీ పనులు కాకుండా ఏం పనులు చేస్తున్నాడని ప్రజలు చర్చించుకుంటున్నారు.

డ్రైనేజీలు నిర్మించకుండానే రోడ్డు పనులు

- పనులతో ఉన్న డ్రైనేజీ కనుమరుగు
- వర్షం వస్తే మునగనున్న ఇళ్లు
- ఆచంపల్లి గ్రామస్థుల ఆందోళన



గ్రామంలో నిలిచిపోయిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు

గంగాధర, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రహదారి నిర్మాణాభివృద్ధి పనులు కొందరికి శాపంగా మారాయి. రోడ్డునిర్మిస్తే సౌకర్యాలు మెరుగవుతాయనుకున్న గ్రామ స్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. రోడ్డు నిర్మాణంతో ఇళ్లకు ముంపుపొంచిఉంది. దీంతో గ్రామస్తులు ఆందో ళన వ్యక్తంచేస్తున్నారు. గంగాధర మండలం కురిక్యాల నుంచి ఆసీఫ్‌నగర్ వరకు సీఆర్ఎఫ్ నిధులతో ఆర్అం డ్‌బీ అధికారులు డబుల్‌రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులు చేసే ముందు గ్రామస్థులు రోడ్డుకు ఇరువైపుల డ్రెయినేజీ, తాగునీటికి పైపులైను, వీధి దీపాల స్థంబాల షిఫ్టింగ్ చేయించాలని అధికారులకు విన్నవించారు. అయితే అధికారులు అవేమీ చేపట్టకుండా రోడ్డు నిర్మా ణం చేపడుతున్నారు. కొత్తగా నిర్మించే రోడ్డుతో గతంలో నిర్మించిన సుమారు 150మీటర్ల డ్రెయినేజీ కనిపించ కుండా పోతోంది. దీంతో చిన్నపాటి వర్షంవస్తే దాదాపు పదిహేను కుటుంబాలు నీటమున గనున్నాయి. రోడ్డు ఎత్తుగా ఉండనుం దని వర్షంనీరు ఇండ్ల నుంచి బయటికి వెళ్లే వీలు లేకుండా పోతుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. డ్రెయినేజీ నిర్మించి వర్షపు నీరు వెళ్లేందుకు వీలుగా రోడ్డుపనులు చేపట్టాలని గ్రామస్థులు అధికారులను కోరారు. ఎవరూ పట్టించు కోకపోవడంతో పనులను అడ్డుకున్నారు. అభివృద్ధి పను లు సౌకర్యవంతంగా ఉండాలి కానీ ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయని ముంపునకు గురయ్యే కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. ఇండ్లవాకిలికన్నా ఎత్తుగా రోడ్డు నిర్మి స్తే చిన్నపాటివర్షంతో ఇండ్లు నీట మునగనున్నాయని ఆవేదన్న వ్యక్తంచేస్తున్నారు. రానున్న వర్షకాలంలో ఇబ్బందులు పడటం ఖాయమని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వర్షపునీరు వెళ్లేలా పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● **వారం రోజులు నీటిలోనే ఉండాలి**

- ఆరే మాధవి, ఆచంపల్లి



రోడ్డు పని పూర్తయితే వర్షకాలంలో నీరు బయటికి వెళ్లక వారం రోజులు నీళ్లలోనే ఉండుడైతది. డ్రెయినేజీ పరిష్కారం చేసిన తరువాత పనులు చేపట్టండి. రోడ్డు అందరికీ అవసరమే మేం కాదనటం లేదు. మొన్న ఒక్కగంట వర్షానికే ఇంటి చుట్టూ వరదనీరుతో పిల్లలతో బాగా కష్టమైంది. అధికారులు పట్టించుకుని డ్రెయినేజీ నిర్మించాలి లేకపోతే ఇంటి చుట్టూ వరద నీటితో పిల్లలు, ముసలోల్లకు కష్టమవుతది.

కళాకారుడు పుల్లాచారికి సన్మానం

హుజూరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైస్కూల్ మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, కళాకారుడు రావుల పుల్లాచారిని ఆదివారం ఘనంగా సన్మానించారు. రెండ్రోజుల క్రితం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ప్రపంచ నాటక రంగస్థలం వేడుకల సందర్భంగా పుల్లాచారి అవార్డు అందుకోగా, వాకర్స్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని చేసిన తీర్మానాన్ని పార్లమెంట్‌లో అమోదం పొందేలా ఏప్రిల్ 1 నుంచి నిర్వహించే నిరసన దీక్ష పోస్టర్‌ను ఆదివారం పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో అజాది ఫెడరేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ గొప్ప కార్యక్రమం

జమ్మికుంట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మన్‌కీ బాత్ గొప్ప కార్యక్రమం అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని 165వ బూత్ శ్రేణులతో కలిసి మన్‌కీ బాత్ కార్యమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో జీడి మల్లేష్, కొలగాని రాజు, మదిరె రవీందర్, మోడం రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

చొప్పదండి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతికి కారకులైన దోషులను పట్టుకోవాలని చొప్పదండిలో క్రైస్తవులు శాంతిర్యాలీ నిర్వహించారు. హోలీ షాలోమ్ చర్చినుంచి గుండేటి శాంతికుమార్ ఆధ్వర్యంలో శాంతిర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

చొప్పదండి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని మార్కెట్‌చౌరస్తాలో ఎస్బీఐ బ్యాంక్ క్లర్క్ పిట్టల అనూష ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం మున్సిపల్ కమిషనర్ నాగరాజు ప్రారంభించారు.

ఖరారు కాని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా

- గ్రామాల్లో జోరుగా సాగుతున్న పైరవీలు
- పోలింగ్ బూత్‌ల వారీగా ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం కసరత్తు
- ఆందోళనలో లబ్ధిదారులు.. పట్టించుకోని నాయకులు

చిగురుమామిడి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17గ్రామాల్లో జరిగిన ప్రజాపాలనలో అనేకమంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇప్పటివరకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా ఖరారు కాలేదు. దీంతో మండలంలోని అధికార పార్టీకి చెందిన చోటామోటా నాయకులు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని జోరుగా పైరవీలు సాగిస్తున్నట్లు సమాచారం. మండలవ్యాప్తంగా ప్రజాపాలనలో 9,873మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎల్-1 లబ్ధిదారులుగా 4829మందిని గుర్తించింది. ఇందులో మళ్లీ ఫైనల్ గా 3870మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. ఐనప్పటికీ లబ్ధిదారుల జాబిత నేటికీ ఖారారు కాలేదు. దీంతో అన్ని అర్హతలు ఉన్న లబ్ధిదారులు తమకు ఇంతకి ఇల్లు వస్తుందో, లేదో అని ఆందోళన చెందుతున్నారు. పోలింగ్‌బూత్‌ల వారీగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజురు అవుతాయనే వార్తతో లబ్ధిదారులు మరింత అయోమయం చెందుతున్నారు. మండలంలో పోలింగ్ బూత్‌లు 40 ఉన్నాయి. ఒక్క బూత్‌కు 8 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని అనధికారికంగా కొంతమంది అధికారులు పేర్కొంటున్నారు. దీని ప్రకారం మండలంలో 40బూత్‌లకు 320 ఇండ్లు మాత్రమే మంజురు అయ్యే అవకాశం ఉన్నది. దీంతో మండలవ్యాప్తంగా 17గ్రామాలనుంచి దరఖాస్తులు చేస్తున్న వారిలో కనీసం 10 శాతం లబ్ధిదారులకు కూడా న్యాయం జరిగే అవకాశం లేదు. వచ్చే ఇండ్లు కూడా అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు సంబంధించిన వారికి మాత్రమే వస్తాయనే ప్రచారం జరుగుతోంది. పేరుకు మాత్రమే ప్రజాపాలన కానీ అంతా రాజకీయంగానే సాగుతుందని, ఇక అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎప్పుడు వస్తాయని మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇల్లు

● **పేదవారికి న్యాయం జరగాలి.. - ఎలగందుల రాజయ్య, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు**

గత ప్రభుత్వం చేసిన విధంగా కాకుండా అర్హులైన, పేదవారికి రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ప్రజాపాలన అనే విధానంపై ప్రజలకు విశ్వాసం కలిగేలా ప్రభుత్వ కృషి చేయాలి. మండలవ్యాప్తంగా లబ్ధిదారుల ఆర్థిక, సామాజిక స్థితిగతులను అధికారులు గుర్తించాలి. ఇష్టారాజ్యంగా చేస్తే మాత్రం ఊరుకునేది లేదు.